సాక్షి సూర్యాపేట

సోమవారం ၊ 9 ၊ జనవరి ၊ 2023



మేమున్నామని..
ఎన్‌ఆర్‌ఐలు జన్మభూమికి సేవలందిస్తు న్నారు. నేడు ప్రవాస భారతీయ దివస్ సందర్భంగా ప్రత్యేక కథనాలు.
- 8లో



జ్ఞానదాతలు కావాలి
సిమెంట్ పరిశ్రమల యజమానులు జ్ఞాన దాతలు కావాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు.
- 8లో

గరిష్టం/కనిష్టం
29.0°/11.0°

వాతావరణం
ఉదయం ఆకాశం పొగమంచుతో మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'హాత్‌సే హాత్ జోడో'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చెవిటి వెంకన్న యాదవ్

భానుపురి (సూర్యాపేట) : జిల్లా వ్యాప్తంగా జనవరి 26 నుంచి నిర్వహించనున్న హాత్‌సే హాత్ జోడో అభియాన్‌ను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ సీనియర్ ఉపాధ్య క్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కోదాడ మాజీ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మా వతిరెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమాలను నిర్వ హించనున్నామని తెలిపారు. రానున్న ఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసం ధానం చేస్తామని చెప్పారు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు జనవరి 26 నుంచి ప్రతి ఇం టికి, ప్రతి గడపకు రాహుల్ గాంధీ ఇచ్చిన సం దేశాన్ని తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచిం చారు. కార్యక్రమంలో తుంగతుర్తి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు, బ్లాక్ కాం గ్రెస్ అధ్యక్షుడు రాజయ్య, అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, కోతి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరికీ సమాన విద్యనందించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : అందరికీ సమాన విద్యనం దించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లిం గయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి డీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ల్లో చదివిన వారికి ఉద్యోగ నియమకాల్లో 50శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు వెంకటేశ్వర్‌రావు, దశరథ రామారావు, వేణు, ఆనంద్‌భాస్కర్, వెంకటే శ్వర్లు, కవిత, క్రాంతికుమార్, రామకృష్ణ తదిత రులు పాల్గొన్నారు.

గోపాలమిత్రల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



లింగమల్లు, అధ్యక్షుడు



నగేష్, ప్రధాన కార్యదర్శి

సూర్యాపేట : గోపాల మిత్రల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా నల్లమాద లింగమల్లు, ప్రధాన కార్యదర్శిగా దూళిపాల నగేష్, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ శంకర్, కోశాధికారి మహబూబ్‌అలీ, సహాయ కోశాధికారిగా సూరారపు అరుణ్‌లతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చిర్రబోయిన సోమయ్య, మేక పోతుల సైదులు, మేడె రామయ్య, ముస్కుల సురేష్ తదితతరులు ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మి చెంచు లక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యక ల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, మూలవిరాట్‌కు పం చామృతాభిషేకం జరిపించారు. కల్యాణ వేడుక లో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవ చనం, రక్షాబంధనం, మధుపర్కపూజ మాంగ ల్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తు లకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూష ణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆం జనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దాచుకున్నా.. ధర వచ్చేనా!



పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెంలో పేర్ల వెంకన్న ఇంట్లో నిల్వ చేసిన పత్తి



తిరుమలగిరిలోని ఓ రైతు ఇంట్లో నిల్వ ఉన్న పత్తి



ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రానికి చెందిన ఈయన పందిరి చంద్రారెడ్డి. నాలు గు ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరాకు నాలు గైదు క్వింటాల్లే దిగుబడి వచ్చింది. ధర అధికంగా వస్తుందనుకుంటే అదీ లేదు. దీంతో పత్తిని అమ్మకుం డా ఇంట్లోనే ఉంచారు. ధర పెరుగకుండా అమ్మితే పెట్టుబడి డబ్బులు రావని వాపోతున్నారు.

ధర లేక పత్తి రైతు దిగాలు

- రేటు పెరుగుతుందనే ఆశతో ఇళ్లలోనే పత్తి నిల్వలు
- తక్కువ ధరకు అమ్ముకోవడానికి నిరాకరిస్తున్న రైతులు
- దిగుబడి తగ్గడంతో డిమాండ్ పెరుగుతుందని ధీమా
- మరికొన్ని చోట్ల చేలల్లోనే పత్తి
- అప్పులపై పెరుగుతున్న వడ్డీతో తిప్పలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో పత్తి రైతులు ఇబ్బందుల్లో పడ్డారు. ధర తగ్గిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతు న్నారు. తక్కువ ధరకు అమ్ముకోలేక, ధర పెరుగు తుందో లేదో తెలియక ఆందోళన చెందుతున్నారు. మొదట్లో వర్షాలు లేక, తరువాత అకాల వర్షాలు పడి, తెగుళ్లతో పంట దిగుబడి సగానికి సగం తగ్గిపోయింది. దీనికితోడు ధర కూడా పడిపోవ డంతో రైతులు ఏం చేయాలో అర్థంకాని స్థితిలో పడ్డారు. ఓవైపు తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగు తుండటంతో ఆవేదన చెందుతున్నారు. అంతర్జా తీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ఎక్స్ పోర్టు తగ్గిపోయి అటు ట్రేడర్లు, ఇటు మిల్లర్లు కొనుగోళ్లు తగ్గించారు. మరోవైపు నష్టానికి అమ్ము కోలేక, ధర పెరిగాకే అమ్ముకుందామనే ఆశలతో రైతులు వేల క్వింటాళ్లు నిల్వ చేసుకుంటున్నారు.

అంచనాలు తలకిందులు

జిల్లాలో 1,09,432 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. తద్వారా జిల్లాలో 10 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈసారి పూత దశలో బాగా వర్షాలు పడి పూత ఎర్రబారి పాడైంది. దీనికితోడు తెగుళ్ల అధికం కావడంతో ఈసారి దిగుబడి తగ్గిపోయింది. రేటు కూడా లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

మద్దతు ధరకే కొంటామంటున్న సీసీఐ

కాటన్ కార్పొరేషన్ ఇండియా (సీసీఐ) పత్తిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెబుతోంది. కానీ, కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,380 మాత్రమే ఉంది. దీంతో ఆ ధరకు అమ్ముకునేం దుకు రైతులు సిద్ధంగా లేరు. ఈ నేపథ్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించలేదు. మరోవైపు ట్రేడర్లు క్వింటాల్‌కు రూ.6,500 నుంచి రూ.7,200 వరకే చెల్లిస్తుండటంతో రైతులు అమ్ము కోవడం లేదు.

పెట్టుబడి ఎక్కువ.. దిగుబడి తక్కువ

ధర తక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి ఎలా అమ్ముకోవాలని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి ఎక్కువగా పెట్టినా దిగుబడి రాలేదు. ఈ పరిస్థితు ల్లో ఇంత తక్కువ ధరకు ఎలా అమ్ముకోవాలని రైతు లు వాపోతున్నారు. వాస్తవానికి ఎకరానికి సగటున 8 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉన్నా కేవలం 3 - 4 క్వింటాల్లే రావడం, ధర తక్కువగా ఉండటం తో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, అందుకే అమ్ముకోవడం లేదని చెబుతున్నారు. కనీసంగా రూ. 10 వేలకు పైగా ధర వచ్చినప్పుడు అమ్ముకుం టామని పేర్కొంటున్నారు.

16 ఎకరాల్లో పత్తి పంట వేశాను



పత్తి ధర తక్కువగా ఉండటంతో ఇంట్లోనే పత్తిని నిల్వ చేశాను. 16 ఎకరాల్లో పత్తి పంట వేయడంతో కూలీల ఖర్చులకే రూ.3 లక్షల అప్పు చేశాను. ధర పెరుగుతుందనుకుంటే ధర పూర్తిగా తగ్గి పోతుంది. ఏమి చేయాలో అర్థంకావడం లేదు. ధర పెరిగాకే అమ్ముతాను.

– శంకర్, నెల్లిబండ తండా, తిరుమలగిరి

అమ్మలేక, దాచుకోలేక ఇబ్బందులు



నాకున్న ఐదెరాలకు తోడు మరో ఐదెరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. మొదట్లో క్వింటాకు రూ.9వేల ధర పలికిం ది. గత ఏడాదిలా రూ.12 వేలకు పైగా ధర పెరుగుతుందని ఇంట్లోనే నిల్వ చేశాను. ఇప్పుడు ధర తగ్గిపోయింది. ఇంట్లో పత్తిని నిల్వ చేయడంతో మేము అరుబయట ఉండాల్సి వస్తోంది. ఇబ్బందులు తప్పడం లేదు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పుపై వడ్డీ పెరుగుతోంది.

– వెంకన్న, సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్



గోదాంను ప్రారంభిస్తున్న మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే గాదరి, ఎంపీ బడుగుల, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచందు, జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రి కేసీఆర్

- ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు
- 25 లక్షల మంది వలస కార్మికులకు ఉపాధి
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- హాజరైన మంత్రి జగదీశ్‌రెడ్డి

అడ్డగూడూరు : రాష్ట్ర ప్రజల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, రైతు బీమా, రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్, రుణమాఫీ, కళ్యాణలక్ష్మి, షాదీముబాకర్.. ఇలా మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. అడ్డగూ డూరు మండలం చౌళ్లరామారంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంను మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, గిడ్డం గుల సంస్థ చైర్మన్ సాయిచందుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బీఆర్ ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ప్రసంగిం చారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా వేలాది కోట్ల రూపాయలతో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారని పేర్కొన్నారు. కేసీఆర్ పక్షి లెక్క దేశమంతా తిరిగి తెలంగాణ రాష్ట్రం సాధించారని, అందుకోసం సకల జనులను ఏకం చేసి పోరాటం చేశారని గుర్తు చేశారు. నిరుద్యోగులకు అండగా నిలబడుతున్నా రని తెలిపారు.

25లక్షల మంది వలస కార్మికులకు ఉపాధి

ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన సుమారు 25ల క్షల మంది కార్మికులకు సీఎం కేసీఆర్ ఉపాధి కల్పిస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. దేశంలో ఒక్క నిమిషం కూడా కరెంట్ పోని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. తెలంగాణలో అభివృద్ధిని చూసి మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం కితాబునిస్తున్నారని పేర్కొ న్నారు. ఆంధ్రోళ్లకు కేసీఆర్ అంటే గిట్టదని ప్రచారం చేసిన వాళ్లకు చెంప పెట్టులాగా మొదట ఆంధ్రప్ర దేశ్ నుంచే బీఆర్‌ఎస్‌లో చేరారని వెల్లడించారు. కేసీఆర్ నాయకత్వం మాకుంటే బాగుండని ఆంధ్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని చీకట్లోకి నెట్టాలని ప్రధానితో సహా కేంద్ర మంత్రు లంతా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నల్లధ నాన్ని బయటకు తీసి దేశ ప్రజలందరి ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున వేస్తానని విఫలమయ్యారని విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతూ ఉన్న ఉద్యోగులను రోడ్డున పడేస్తున్నా రని ధ్వజమెత్తారు. అడగకుండానే ప్రజలకు కేసీఆర్ అన్నీ చేశారని, వాగ్దానాలు అమలు చేయకుండా మోదీ మోసం చేశారని ఆరోపించారు.

కేంద్రాన్ని ఎదురించి వడ్లు కొన్న కేసీఆర్

రైతులు పండించిన వడ్లను కేంద్రం కొనకపోతే రైతుల పక్షాన కేసీఆర్ నిలబడి కొనుగోలు చేశారని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలను అందించి బీడు భూములను సైతం సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అన్ని వర్గాల ప్రజలకు భరోసా ఇస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియా డారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడు గుల లింగయ్య యాదవ్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకష్టారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎంపీపీ దర్శనాల అంజయ్య, జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి, మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి, అడ్డగూడూరు, మోత్కూరు బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ర మేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఆధార్

- బోగస్ కూలీలకు చెక్ పెట్టేందుకు ఆధార్ బేస్‌డ్ విధానాన్ని తీసుకువచ్చిన కేంద్రం
- జాబ్ కార్డుకు ఆధార్ లింక్ కాకపోతే నిలిచిపోనున్న కూలి చెల్లింపులు



పని చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

హుజూర్‌నగర్ : జాతీయ ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కూలీ హాజరు నమోదు కోసం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్)ను అమ లులోకి తెచ్చిన కేంద్రం తాజాగా కూలిల చెల్లింపుల్లో నూ కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ఉపాధి కూలీల జాబ్‌కార్డును వారి ఆధార్‌తో అనుసం ధానం చేస్తోంది. దీంతో బోగస్ కూలీలకు చెక్ పడ డమే కాకుండా కేంద్రం విడుదల చేసే నిధులు నేరు గా కూలీల ఖాతాలో జమకానున్నాయి. అయితే ఆధార్ సీడింగ్‌లో జిల్లా మెరుగైన స్థానంలో ఉన్నా జాబ్ కార్డు, ఆధార్ వివరాలు సరిపోలకపోవడం సమస్యాత్మకంగా మారుతోంది. ఆధార్ అథెంటికే షన్ ప్రక్రియ కొనసాగుతుండగా వేలాది దరఖాస్తు లు తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో కూలీలు ఉపాధికి దూరమయ్యే అవకాశం ఉంది.

చెల్లింపుల్లో పూర్తి పారదర్శకత

ఉపాధి హామీ కూలీలకు ప్రస్తుతం బ్యాంక్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా కూలి డబ్బులు చెల్లిస్తోంది. అయితే కొందరికి రెండేసి చొప్పున జాబ్‌కార్డులు ఉండడంతో పాటు, మరికొంత మంది పనులకు హాజరు కాకున్నా కూలి పొందుతున్నారు. రాజకీయ పలుకుబడి, నాయకుల అండదండలలతో పను లకు హాజరువుతున్నట్లుగా పేర్లు నమోదు చేసుకుని డబ్బులు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిని గుర్తించిన కేంద్రం కూలి చెల్లింపుల్లో పూర్తి పారదర్శకత తీసుకురావాలని సంకల్పించింది. కూలి చెల్లింపుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా ఆధార్ బేస్‌డ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇందులో భాగంగానే కూలీల జాబ్ కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేస్తోంది. దీంతో ఇకపై ఆధార్ లింకై న బ్యాంక్, పోస్టల్ బ్యాంక్ ఖాతాల్లో మాత్రమే కూలి డబ్బులు జమ కాను న్నాయి. పబ్లిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీ ఎఫ్‌ఎంఎస్) ద్వారా డబ్బులు ఎటు వెళ్తున్నాయనేది కేంద్రం నేరుగా పర్యవేక్షించే వెసులుబాటు కలగనుంది.

జిల్లాలో 6,31,156 మంది ఉపాధి కూలీలు..

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 2,71,992 జాబ్ కార్డులు ఉండగా వాటిలో 6,31,156 మంది కూలీలు నమోదై ఉన్నారు. వారిలో పనికి వచ్చే వారు 3,72,666 మంది ఉన్నారు.

ముమ్మరంగా సాగుతున్న ప్రక్రియ

జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ జిల్లా లో ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకు 96.83 శాతం జాబ్‌కార్డులకు ఆధార్‌ను లింక్ చేశారు. అయితే రెండింటి (ఆధార్‌కార్డు, జాబ్ కార్డు)లో కూలీల పేర్లు, చిరునామా వంటి వివ రాలు సరిపోలకపోవడంతో భారీ సంఖ్యలో కార్డు లు తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పటి వరకు 3,18,832 కార్డులు తిరస్కరణకు గురికావడంతో అప్రూవల్ కోసం పెండింగ్‌లో ఉంచారు. వాటిని మళ్లీ అథెంటికేషన్ కోసం పంపనున్నారు. దీంతో మరికొన్ని సవరణలతో కొన్ని కార్డులు అమలులోకి రానున్నాయి. ప్రస్తుతం 29,770 మందికి ఆధార్ బేస్‌డ్ పేమెంట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

ఆధార్‌ను బట్టి జాబ్‌కార్డును మారుస్తాం



జాబ్ కార్డులో ఉన్న వివ రాలకు ఆధార్ కార్డులో ఉన్న వివరాలు సరిపోలక పోవడంతోనే కొన్ని కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని మళ్లీ అథెంటికేషన్‌కు పంపనున్నారు. కార్డులో ఉన్న వాటి వివరాలు 40 శాతం వరకు సరిపోలితే వాటిని పరిగణలోకి తీసుకుంటారు. లేదంటే ఆధార్‌కార్డు వివ రాలను బట్టి జాబ్ కార్డును సవరణ చేసి వినియోగంలోకి తెస్తాం.

– డాక్టర్ పెంటయ్య, డీఆర్‌డీఓ, సూర్యాపేట

చిన్నారుల వైద్యంపై నిర్లక్ష్యం



జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపం లోని ఓ ప్రైవేట్ చిన్న పిల్లల ఆస్పత్రిలో నెల రోజుల క్రితం నూతనకల్ మండ లానికి చెందిన ఓ బాబు మృతిచెందాడు. ఆ బాబుకు జ్వరం రావడంతో తల్లిదండ్రు లు వైద్యం చేయించేందుకు సూర్యాపే టలోని సదరు ఆస్పత్రికి తీసుకొచ్చారు. రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచుకొని వైద్యం చేసి.. తీరా ప్రాణం పోయాక కూడా చెప్పకుండా ఆ రోజంతా డెడ్‌బాడీని ఉంచు కొని మరుసటి రోజు మీ బాబు చనిపోయాడని తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించారు.

సూర్యాపేటలోని ఎంజీ రోడ్డులో గల మరో చిన్న పిల్లల ఆస్పత్రిలో గతనెలలో అప్పుడే పుట్టిన చిన్నారిని చేర్పించారు. పరీక్షించిన డాక్టర్ రోజంతా ఉంచుకొని పరిస్థితి విషమించిందని మెరుగైన వైద్యం చేయాలని వారినుంచి పూర్తిస్థాయిలో డబ్బు లు వసూలు చేసుకున్నాడు. చివరకు తన వల్ల కాదని చేతులెత్తేసి చిన్నారి మృతి చెందాక మృత దేహాన్ని అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యాన్ని ఇలా వ్యాపారంగా మార్చుకొని రూ.వేలకు వేలు వసూలు చేస్తూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

- చిన్నపిల్లల ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా వైద్యసేవలు
- సిబ్బందికి ఫోన్లలో చెబుతూ వైద్యం
- వసతులు లేకున్నా రూ.వేలకు వేలు ఫీజు వసూలు
- గాలిలో కలిసిపోతున్న చిన్నారుల ప్రాణాలు
- పట్టింపులేని వైద్యఆరోగ్య శాఖ

సూర్యాపేట : జిల్లాలోని కొందరు ప్రైవేట్ ఆస్ప త్రుల వైద్యులు చిన్నపిల్లలకు నిర్లక్ష్యంగా వైద్యసేవ లు అందిస్తున్నారు. చిన్నపాటి దగ్గు, జలుబు, జ్వరం వచ్చిందని ఆయా ఆస్పత్రులకు వెళ్లినా వివిధ రకాల పరీక్షలు చేస్తూ నాణ్యమైన వైద్యం అం దించకుండా రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు. జూనియర్లు, అసిస్టెంట్లతో వచ్చిరాని వైద్యం చేయిస్తూ పసివాళ్ల ప్రాణాలు తీస్తూ తల్లిదం డ్రులకు గుండెకోత మిగుల్చుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు తమ పిల్లలకు చిన్న పాటి జబ్బు చేసినా స్థానిక డాక్టర్లకు చూపిస్తే నయ మవుతుందో కాదోనన్న భయంతో నేరుగా జిల్లా కేం ద్రంలోని ప్రైవేట్ చిన్నపిల్లల ఆస్పత్రులకు తీసు కొస్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం నిపుణులైన డాక్టర్లు అందుబాటులో లేకున్నా ఆయా ఆస్పత్రుల్లో ఉండే సిబ్బందే తెలిసీతెలియని వైద్యం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 50 ప్రైవేట్ పిల్లల ఆస్పత్రులు ఉన్నాయి.

కనీస వసతులు కరువు..

ప్రైవేట్ పిల్లల ఆస్పత్రుల్లో కనీస వసతులు కూడా ఉండవు. కానీ ఆస్పత్రులకు వచ్చే చిన్నారుల తల్లిదండ్రుల నుంచి మాత్రం రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ చిన్నారుల ప్రాణాలను కాపాడడంలో వైద్యులు విఫలమవుతు న్నారు. కొన్ని చిన్న పిల్లల ఆస్పత్రుల్లోనైతే బెంచీల మీదనే పడుకోబెట్టి వైద్యం అందిస్తున్నారు. మరికొన్ని ఆస్పత్రుల్లో కాలం చెల్లిన మందులను కూడా అంటగడుతూ డబ్బులు గుంజేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే చిన్నారుల తల్లిదండ్రుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు కోకొల్లలు. ఇప్పటికై నా ఇలాంటి ఘటనలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేయి స్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, డాక్టర్లపై చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



చిన్న పిల్లల ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అం దించాలి. వైద్యం అందిం చడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటాం. చిన్నారులకు వైద్యం చేసే సమయంలో తగిన జాగ్ర త్తగా వ్యవహరించాలి. తల్లిదండ్రులకు ఆరోగ్య సమాచారాన్ని చేరవేయాలి. తమ వల్ల కాక పోతే వెంటనే పెద్దాస్పత్రులకు రిఫర్ చేయాలి.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి, సూర్యాపేట

ప్రత్యేకంగా పర్యవేక్షించని వైద్యులు

ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చిన చిన్నారులను పరీక్షించిన అనంతరం డాక్టర్లు తమ పర్యవేక్ష ణలో ఉంచుకొని వైద్యం చేయాల్సి ఉంది. కానీ జిల్లా కేంద్రంతోపాటు వివిధ పట్టణాల్లోని చిన్న పిల్లల ఆస్పత్రుల్లో మాత్రం దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కొందరు వైద్యులు తమ ఆస్పత్రుల్లో ప్రాక్టీస్ చేస్తున్న నర్సులతో వైద్యం చేయిస్తున్నారు. కనీస అవగాహన లేని వారిని ఆస్పత్రుల్లో పనిచేయించుకుంటున్న డాక్టర్లు ఎక్కడో ఉండి ఫోన్లలోనే చెబుతూ వైద్యం చేయి స్తూ చిన్నారుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు.

పెద్దగట్టులో మొదలైన జాతర సందడి

- భారీగా తరలివచ్చిన భక్తులు



ఆలయం చుట్టూ గంపలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

చివ్వెంల(సూర్యాపేట): తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర పెద్దగట్టు(లింగమం తులస్వామి)లో భక్తుల సందడి మొదలైంది. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జాతర జరుగ నున్న నేపథ్యంలో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇప్పటి నుంచే స్వామి వారిని దర్శించుకుని యాటపోతుల, కోళ్ల బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హెచ్‌డబ్ల్యూఓ పరీక్షలకు ఉచిత శిక్షణ

నల్లగొండ రూరల్: హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డ బ్ల్యూఓ) పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యం లో ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వను న్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 16లోపు నల్లగొండలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాల యంలో నేరుగా దరఖాస్తు అందజేయాలని సూచిం చారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక గరిష్ట ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలని, గతంలో స్టడీ సర్కిల్ లో శిక్షణ పొందినవారు అర్హులు కాదని తెలిపారు. అర్హత, కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఓటీఆర్ దరఖాస్తు అందజేయాలని.. వివరాలకు ఫోన్ నంబర్ 08682-220007 సంప్రదించాలని కోరారు.

ఉద్యోగులు, నాయకులు ఐక్యంగా ఉండాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య



ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

చివ్వెంల(సూర్యాపేట) : యాదవ ఉద్యోగులు, యువజన సంఘాల నాయకులు ఐక్యమత్యంగా ఉండా లని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యా దవ్ అన్నారు. యాదవ ఉద్యోగులు, అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన వేర్వేరు క్యాలెండర్లను ఆదివారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో శ్రీ లింగ మంతుల స్వామి (పెద్దగట్టు) ఆలయ ప్రాంగణం లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఫిబ్రవరి 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న పెద్దగట్టు జాత రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. జాతరకు రూ.5 కోట్లు మంజూరు చేయడం పట్ల సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, శ్రీకృష్ణ ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు డాక్టర్ వూర రామ్మూర్తి, యాదవ ఉద్యో గుల సంఘం అధ్యక్షుడు మట్టపల్లి రాము యాదవ్, ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్, మర్యాద సైదులు, వీరబోయిన వెంకటేశ్వర్లు, అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్యాద ఉపేందర్, జక్కుల నరేందర్, జక్కుల శంబయ్య, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మేమున్నామని..

విదేశాల్లో ఉన్నా.. సొంతూరిపై మమకారం

- సేవా కార్యక్రమాలతో దాతృత్వం చాటుకుంటున్న ఎన్‌ఆర్‌ఐలు
- విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి
- కోవిడ్ సమయంలో ప్రజలకు అండ
- ఆలయాలు, రోడ్లు, భవనాల నిర్మాణానికి విరాళాలు

నేడు ప్రవాసీ భారతీయ దివస్

విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు పుట్టిన ఊరిపై మమకారాన్ని చాటుకుంటున్నారు. తాము సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని ఊరి కోసం వెచ్చిస్తున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. ప్రజలు కష్టాల్లో పాలుపంచుకుంటూ మేమున్నామని భరోసా ఇస్తున్నారు. సొంతూళ్లలో పాఠశాలలు, ఫంక్షన్ హాళ్లు, సీసీ రోడ్లు, ఇతర భవనాల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. మరి కొందరు విదేశాల్లో ఉండి అక్కడ మనవారికి అండగా నిలబడుతున్నారు. సోమవారం ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ప్రత్యేక కథనాలు.

ఎన్‌ఆర్‌ఐ మల్లారెడ్డి దాతృత్వం



వలిగొండ మండలం సుంకిశాల దేవాలయం వెనుక నిర్మించిన ఫంక్షన్ హాల్

సాక్షి, యాదాద్రి : ఎన్‌ఆర్‌ఐ పైళ్ల మల్లారెడ్డి తన సొంత ఊరులో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వలిగొండ మండలం సుంకిశాలకు చెందిన మల్లారెడ్డి అమెరికా న్యూయార్క్‌లో పారిశ్రామిక వేత్తగా స్థిరపడ్డారు. తన స్వగ్రామమైన సుంకిశాలలో రూ.3 కోట్లతో దేవాలయం నిర్మించారు. యాదాద్రి దివ్య విమాన తాపడం కోసం కిలో బంగారం విరాళంగా అందజేశారు. సుంకిశాలలో దేవాలయం వెనుక ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం రూ.3 కోట్లు ఇచ్చారు. మినీ ఫంక్షన్ హాల్ శ్లాబ్ మరమ్మతులకు రూ.50 లక్షలు, కొత్త ఫంక్షన్ హాల్‌లో డైనింగ్ హాల్‌ను రూ.50 లక్షలతో ఆధునీకరించారు. వలిగొండలో జూనియర్ కళాశాల స్థలం, భవన నిర్మాణం కోసం రూ.2.5 కోట్లు, వలిగొండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి రూ.2 కోట్లు, వలిగొండలో పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ స్థలం కోసం 5 ఎకరాల స్థలం ఇచ్చారు. హైదరాబాద్‌లోని ఇండో అమెరికన్ ఆస్పత్రిలో ఒక ఫ్లోర్ నిర్మించారు.

మాతృభూమికి సేవ చేయడంలో ఆనందం



విద్యా, వైద్యం, ఆధ్మాత్మిక, మౌలిక వసతుల కోసం ఆర్థికసాయం అందించడం ఆనందంగా ఉంది. నా స్వగ్రామం సుంకిశాలలో దేవాయల నిర్మాణం నుంచి ఎన్నో కార్యక్రమాలకు సాయపడ్డారు. ప్రజ లకు సేవ లందించడం కోసం ముందుంటాను.

– పైళ్ల మల్లారెడ్డి, ఎన్‌ఆర్‌ఐ, న్యూయార్క్

స్వదేశానికి తిరిగొచ్చి సేవలు



మన్నెం రంజిత్ యాదవ్

నిడమనూరు : నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన మన్నెం రంజిత్‌యాదవ్ బ్రిటన్‌లో పదేళ్లపాటు ఉద్యోగం చేశారు. అమెరికాలోనూ వ్యాపారాలు చేశారు. కానీ సొంత గడ్డపై మమకారంతో పూర్తిగా ఇండియాకు తిరిగొచ్చారు. నాగార్జునసాగర్ నియోజకవర్గం వ్యాప్తంగా పేదలకు అండగా ఉంటున్నారు. కరోనా సమయంలో రంజిత్‌యాద్ అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్నా ఇక్కడ ఎర్రబెలి గ్రామస్తులతో పాటు నియోజకవర్గంలోని పేదలకు తన ప్రతినిధుల ద్వారా నిత్యావసర సరుకులను, మెడికల్ కిట్లు, శానిటజర్లు పంపిణీ చేశారు. యువతను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. దివ్యాంగులకు సైతం అండగా నిలుస్తున్నాడు.

పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ..



బాలెంల ఉన్నత పాఠశాలలో స్ప్రెడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన కళావేదిక

సూర్యాపేట రూరల్ : పుట్టిన ఊరిని, చదువుకున్న బడిని మరిచిపోకుండా తన గ్రామానికి, చదువుకున్న పాఠశాలకు సేవ చేస్తున్నాడు సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ పటేల్ శ్రీధర్‌రెడ్డి. 2003లో స్ప్రెడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. దీంతోపాటు సూర్యాపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు అదనపు గదులు, మౌలిక వసతుల కల్పనకు సాయం చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

స్ప్రెడ్ ఇండియా చేపట్టిన కార్యక్రమాలు..

- సూర్యాపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటి వరకు సుమారు 100కు పైగా అదనపు తరగతి గదుల నిర్మాణం.
- సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భవన నిర్మాణానికి రూ.50 లక్షల ఆర్థికసాయం.
- బాలెంల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు రెండు ఎకరాల స్థలం విరాళంగా ఇచ్చారు. గ్రామంలోని రెండు పాఠశాలలకు 25 కంప్యూటర్లు అందజేశారు. కంప్యూటర్ విద్య బోధించేందుకు ఇన్‌స్ట్రక్టర్ నెలకు రూ.10 వేల వేతనం ఇస్తున్నారు.
- బాలెంల పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు గాను 3 ప్రొజెక్టర్‌లు, మూడు ల్యాప్‌టాప్‌లు, మూడు స్పీకర్లను అందజేశారు.
- రూ.85 వేలు ఖర్చు చేసి పాఠశాలకు రంగులు వేయించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. రూ.35 వేలతో వాటర్ ట్యాంక్‌లను నిర్మించారు. విద్యార్థులకు మినరల్ వాటర్ అందజేస్తున్నారు.
- విద్యార్థులు ఆంగ్లబాషలో ప్రావీణ్యం పెంపొందేందుకు గాను ఉచితంగా గ్రామర్ బుక్స్ పంపిణీ చేశారు.
- పాఠశాలలో పార్కింగ్ కోసం రూ.35 వేలతో షెడ్ నిర్మించారు.
- విద్యార్థినులకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పించేందుకు గాను 10 కుట్టుమిషన్‌లు ఏర్పాటు చేసి కుట్టు శిక్షణ ఇప్పిస్తున్నారు.
- అనాథ పిల్లల కోసం 20 సంవత్సరాల నుంచి బాలెంలలో స్ప్రెడ్ హాస్టల్ నిర్వహిస్తున్నారు.
- బాలెంలలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టు శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పిస్తున్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం



బాలెంల పాఠశాలను కార్పొరేట్ దీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నా. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. విద్యారంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2003లో స్ప్రెడ్ ఇండియా సంస్థను ఏర్పాటు చేశాం. ఆంగ్ల బాష, కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి. పేద, మధ్య తరగతి విద్యార్థులందరూ 75 శాతం మంది ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విధంగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో 75 శాతం మంది ప్రభుత్వ పాఠశాలకే వెళ్తారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేలా చట్టం తేవాలి.

– పటేల్ శ్రీధర్‌రెడ్డి, స్ప్రెడ్ ఇండియా సంస్థ చైర్మన్

విద్యాభివృద్ధికి నిరంతరం తోడ్పాటు



బోడంగిపర్తిలో పాఠశాల విద్యార్థులతో ఎన్‌ఆర్‌ఐ లక్ష్మయ్య

చండూరు : చండూరు మండలం బోడంగిపర్తి గ్రామానికి చెందిన డాక్టర్ మంచికంటి లక్ష్మయ్య అమెరికాలో వైద్యుడిగా స్థిరపడ్డారు. పల్లెటూరిలో పుట్టడంతో చదువుకోవాడానికి అనేక కష్టపడాల్సి వచ్చింది. తనలా ఏ విద్యార్థి కూడా కష్ట పడకూడదన్న ఉద్దేశంతో స్వగ్రామంలో రూ.4.5 కోట్లతో తండ్రి మంచికంటి యాదగిరి పేరున జూనియర్ కళాశాల, నాయినమ్మ గోపమ్మ పేరున ప్రభుత్వ పాఠశాల, తల్లి లక్ష్మమ్మ పేరున ఆంగ్లం పాఠశాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో బస్సుల సౌకర్యం కల్పించారు. పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తూ వస్తున్నారు. పాఠశాల, కళాశాల నిర్వహణకు ఏటా రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇదే కాకుండా మంచికంటి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ పేరుతో అనేక మంది పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. గ్రామంలో కూడా కోట్ల రూపాయాలతో సీసీ రోడ్లు వేయిస్తున్నారు.

చదివిన బడిలో గదుల నిర్మాణం



తండ్రి జ్ఞాపకార్థం ఎన్‌ఆర్‌ఐ మల్లవరపు అనంతచౌదరి ఇచ్చిన నిధులతో నిర్మించిన తరగతి గదులు

సాక్షి, యాదాద్రి : తాను చదువుకున్న పాఠశాల శిథిలమై కూలిపోయే స్థితిలో ఉండడంతో పాఠశాల భవన నిర్మాణానికి తనవంతు సాయమందించారు యూఎస్‌లోని డల్లాస్‌లో వ్యాపారవేత్తగా స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐ మల్లవరపు అనంత చౌదరి. చౌదరి తన తండ్రి మల్లవరపు ఇన్నయ్యచౌదరి యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేశారు. సమయంలో అనంతచౌదరి ఏడు, ఎనిమిది తరగతులు ఈ పాఠశాలలో చదివారు. తాను చదివిన పాఠశాల కూలిపోయే స్థితిలో ఉండడంతో విద్యార్థులకు ప్రమాదం జరుగకుండా వెంటనే మూసి వేయాలని విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు. ఈ విషయాన్ని సర్పంచ్ రాములు ద్వారా తెలుసుకున్న అనంత చౌదరి పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి తన తండ్రి జ్ఞాపకార్థం రూ.50 లక్షలు అందజేశారు. గత సంవత్సరం డిసెంబర్ 12న ఆ తరగతి గదులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి.

ఆనందంగా ఉంది



తాను చదువుకున్న పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి విరాళం ఇవ్వడం ఆనందంగా ఉంది. తనకు ఈ విషయం చెప్పి ఆర్థిక సాయం అందించడానికి కర్త, ఖర్మ, క్రియ అంతా గ్రామ సర్పంచ్ బీమగాని రాములే. తరగతి గదులు నిర్మించి ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది.

– మల్లవరపు అనంత చౌదరి, ఎన్‌ఆర్‌ఐ, డల్లాస్

అమెరికాలో మనవారికి అండగా..



ఇండో అమెరికన్ చారిటీ ఫౌండేషన్ సమావేశంలో మాట్లాడుతున్న బంగార్‌రెడ్డి

అర్వపల్లి : అమెరికాలో స్థిరపడి అక్కడే సేవా కార్యక్రమాలు చేస్తూ, రాజకీయాల్లో రాణిస్తున్నారు జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన ఆలూరి బంగార్‌రెడ్డి. బంగార్‌రెడ్డి జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో టెన్త్ వరకు చదివారు. 30 ఏళ్ల కిందట ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అక్కడ ఎంఎస్ చేసి అక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డారు. అమెరికా పౌరుడయ్యారు. టెక్సాస్ రాష్ట్రం జూస్టన్ నగరంలో ఉంటున్నారు. ఆయనకు అక్కడి ఐటీ ఇండస్ట్రీలో 25ఏళ్ల అనుభవం ఉంది. మన ఈ ప్రాంతం నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అమెరికాకు వెళ్లడానికి తగు సూచనలు, సలహాలు ఇస్తూ అక్కడి కంపెనీల్లో చేర్పిస్తూ తనవంతు సాయమందిస్తున్నారు. ఇండియన్ కమ్యూనిటీలో వలంటీర్‌గా, ఆర్గనైజర్‌గా, ఈవెంట్ ఆర్గనైజర్‌గా చాలా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. అక్కడ ఇండియన్ కల్చరల్ సెంటర్ (ఐసీసీ) ఏర్పాటు చేసి కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. అమెరికాలో బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు. అమెరికాలో చినజీయర్ ట్రస్ట్ ఎడ్యుకేషన్‌కు చైర్మన్‌గా కూడా పనిచేస్తున్నారు. జూస్టన్‌లో అష్టలక్ష్మీ దేవాలయాన్ని నిర్మించి ఈ ఆలయానికి ప్రెసిడెంట్‌గా కూడా ఉన్నారు. అమెరికాలో రిపబ్లికన్ పార్టీ తరుపున గత ఎన్నికల్లో అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడిగా పోటీ చేశారు. జూస్టన్ నగరంలో రిపబ్లికన్ పార్టీకి ఈయన ముఖ్యనాయకుడు. అమెరికాలో ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు బంగార్‌రెడ్డి ముందుండి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సొంత ప్రాంతానికి.. కొంత చేయాలనే తపన



కోవిడ్ సమయంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లను అందజేస్తున్న సంస్థ సభ్యులు

రామగిరి(నల్లగొండ) : ఉన్నత చదువులు చదువుకుని విదేశాల్లో స్థిరపడినప్పటికీ సొంత ప్రాంతానికి సేవ చేయాలనే తపన వారిలో బలంగా నాటుకుంది. పుట్టిన పెరిగిన ప్రాంతం కూడా అభివృద్ధి కావాలనే తలంపుతో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సుమారు 10 మంది విదేశాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు అంతా కలిసి nalgonda. org అనే సంస్థను 1998 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. సభ్యులు అంతా ప్రతి నెలా కొంత మొత్తం విరాళంగా అందిస్తూ ఆ సంస్థ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎన్‌ఆర్‌ఐలు చేపట్టిన కార్యక్రమాలు ఇలా..

- 2005 నాంపల్లి, మునుగోడు ప్రాంతాల్లో ఫ్లోరోసిస్ ప్రభావం ఉన్న చోట చెక్ డ్యామ్‌లు నిర్మించారు.
- 2003 నుంచి 2012 వరకు పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేశారు.
- 2005 నుంచి 2010 వరకు అనేక గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు.
- మిర్యాలగూడలోని కెఎన్‌ఎం డిగ్రీ కాలేజీ భవన నిర్మాణానికి రూ.45 లక్షల విరాళాన్ని అందజేశారు.
- 2007లో పోలీసు శాఖతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
- కోవిడ్ మొదటి, రెండవ వేవ్ సమయంలో దాదాపు రూ.1.5 కోట్ల ఖర్చుతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ, మిర్యాలగూడ, నల్లగొండలో ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోవిడ్ మందులతో పాటు అత్యవసరమైన వారికి ఆక్సిజన్ కిట్లను అందించారు. కోవిడ్ చికిత్స చేసే వైద్యులకు మాస్కులు, శానిటైజర్లు, ఫేస్ షీల్డ్, టెస్ట్ కిట్లను అందజేశారు.

ఉద్యోగ అవకాశాలు పెరగాలి



25 సంవత్సరాల క్రితం నాకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. తర్వాత సొంతంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు స్థాపించి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిపరడ్డాను. నల్లగొండ జిల్లా యువత ఉద్యోగ అవకాశాలు పెరగాలనే ఉద్దేశ్యంతో nalgonda.org స్థాపించాం. మా సంస్థ ద్వారా ఉచితంగా కన్సల్టెన్సీ ఏర్పాటు చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీటెక్ పూర్తి చేసిన అనేక మంది విద్యార్థులు విదేశాలకు వచ్చేలా కృషి చేశాం. వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. సొంత ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ఫౌండర్ సభ్యుడు

రాష్ట్ర ప్రగతి ఫాంహౌజ్‌కే పరిమితం



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

రామన్నపేట: రాష్ట్రంలో ప్రగతి సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కే పరిమితం అయ్యిందని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో ఆయన బీజేపీ జెండాను ఆవిష్కరించి అనంతరం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అవినీతిమయమైన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గర్దాసు సురేష్, అసెంబ్లీ కన్వీనర్ మైల నరసింహ, కోకన్వీనర్ ఎం. ప్రభాకర్‌రావు, నాయకులు శేపూరి రవీందర్, పల్లపు దుర్గయ్య, అక్కెనపల్లి సైదులు, రాపోలు నరేష్, మద్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరణిస్తూ.. మరో నలుగురికి కొత్త జీవితం

పాలకవీడు: మండలంలోని గుడగుంట్లపాలెంకి చెందిన కాతోజు జయమ్మ(60) ఇంట్లో జారిపడడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శని వారం జయమ్మ బ్రెయిన్ డెడ్ అయినట్లు డాక్టర్లు ప్రకటించడంతో కుటుంబ సభ్యులు ఆమె అవయవాలు దానం చేశారు. గుండె, కిడ్నీలు, లివర్ సేకరించి, మరో నలుగురికి అమర్చినట్లు జీవన్‌దాన్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

భూతగాదాలతో వృద్ధురాలి హత్య

- కళ్లలో కారం చల్లి, రాళ్లతో కొట్టి చంపిన వైనం
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మోదిన్‌పురంలో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం

చివ్వెంల(సూర్యాపేట): భూతగాదాలతో వృద్ధురాలిని హత్య చేసిన ఘటన సూర్యాపేట జిల్లాలోని చివ్వెంల మండలం మోదిన్‌పురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోదిన్‌పురం గ్రామానికి చెందిన కక్కిరేణి భిక్షమయ్య, వెంకటమ్మ దంపతులు 20ఏళ్ల క్రితం గ్రామంలో 5ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఇందులో 3ఎకరాలు గ్రామానికి చెందిన కాకి రాంరెడ్డికి విక్రయించారు. ఈ మూడెకరాల భూమిలోనే 2ఎకరాలను రాంరెడ్డి కుమారుడు అంజిరెడ్డి వద్ద ఐదేళ్ల క్రితం మళ్లీ భిక్షమయ్య కొనుగోలు చేశాడు. అదే సంవత్సరం అనారోగ్యంతో భిక్షమయ్య మృతిచెందడంతో ఆయన కుమారులు శ్రీను, సుధాకర్, ప్రభాకర్ భూమిని కౌలుకు ఇచ్చారు. ఈ క్రమంలో అంజిరెడ్డి వద్ద మిగిలిన ఎకరం భూమిని ఆరు నెలల క్రితం అదే గ్రామంలో ఉంటున్న పాండ్యానాయక్ తండాకు చెందిన ధరావతు చత్రునాయక్‌కు విక్రయించి రూ.2లక్షలు అడ్వాన్స్ తీసుకన్నాడు. కాగా గతంలో తాము అమ్మిన భూమే కావడంతో ఆ ఎకరం భూమి కూడా తామే కొనుగోలు చేస్తామని చత్రునాయక్‌తో పాటు అంజిరెడ్డికి భిక్షమయ్య కుమారులు తెలిపారు. ఇందుకు చత్రునాయక్ ఒప్పుకోకపోవడంతో భిక్షమయ్య కుమారులకు అంజిరెడ్డి, చత్రునాయక్ మధ్య వివాదం నడుస్తుంది.

అనుకున్న పథకం ప్రకారం..

ఈ క్రమంలో అంజిరెడ్డి తాను చత్రునాయక్‌కు విక్రయించిన ఎకరం భూమిని అతడి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే రిజిస్ట్రేషన్ చేసే సమయంలో వేరే సర్వే నంబర్ వేయడంతో పాటు భిక్షమయ్య కుమారులకు చెందిన భూమిలో కొంత భూమిని కలుపుతూ చత్రునాయక్‌కు అంజిరెడ్డి హద్దులు చూపించాడు. గతంలో భిక్షమయ్య కొనుగోలు చేసిన 5ఎకరాలకు సంబంధించిన భూమి ధరణిలో అతని పేరు మీదనే ఉండటంతో ఈ 5ఎకరాలకు సంబంధించి అతడి కుమారులు ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నారు. దీంతో చత్రునాయక్ తాను కొనుగోలు చేసిన భూమికి ఇంజక్షన్ ఆర్డర్ ఎలా తెస్తారని భిక్షమయ్య కుమారులతో గత కొంతకాలంగా ఘర్షణ పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం భిక్షమయ్య భార్య వెంకటమ్మ (70), కుమారులు శ్రీను, సుధాకర్, ప్రభాకర్, శ్రీను భార్య రమాదేవి, ప్రభాకర్ కుమార్తెలు రచన, సాత్విక తాము కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు పూజ చేసేందుకు వ్యవసాయ పొలంలో ఉన్న ఉప్పలమ్మ వద్దకు వెళ్లారు. అప్పటికే అంజిరెడ్డి ట్రాక్టర్‌తో చత్రునాయక్‌కు విక్రయించిన ఎకరం భూమి దున్నుతున్నాడు. ఇది గమనించిన శ్రీను అక్కడకు వెళ్లి.. కోర్టు ఆర్డర్ ఇచ్చిన తర్వాత భూమి ఎందుకు దున్నుతున్నావు అని అడుగుతుండగా అక్కడే ఉన్న చత్రునాయక్, అతడి భార్య జయమ్మ, కుమారులు సతీష్, మధు,చత్రు తమ్ముడి కుమారుడు శ్రీను అప్పటికే తమ వెంట తెచ్చుకున్న కారం పొడిని శ్రీను, సుధాకర్, ప్రభాకర్, రమాదేవి, వెంటకమ్మ కళ్లలో కొట్టి వారు కింద పడగానే రాళ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వెంటకమ్మను చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం ఆదేశాలతో సీఐ సోమ్‌నారయణ్ సింగ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అప్పులబాధతో యువ రైతు ఆత్మహత్య



గూడూరు రవీందర్‌రెడ్డి (ఫైల్)

చౌటుప్పల్: అప్పులబాధతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువ రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన గూడూరు రవీందర్‌రెడ్డి(37) తనకున్న వ్యవసాయ భూమితో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశాడు. పంట పెట్టుబడి కోసం అప్పు తెచ్చాడు. కానీ సరైన దిగుబడి రాకపోవడంతో అప్పుల భారం పెరగడంతో మనస్తాపానికి గురైన రవీందర్‌రెడ్డి డిసెంబర్ 29న తన పొలం వద్ద పత్తి పంటకు వేసే పురుగు మందు తాగి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన అతడి భార్య సంతోష ఏమైందని అడగడంతో పురుగు మందు తాగానని చెప్పాడు. దీంతో హుటాహుటిన అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య సంతోష ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- ఆత్మకూరు-ఎస్ మండలం ఏపూరులో యువకుడు..
- కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులో మరొకరు



సతీష్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట): మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపూరు గ్రామానికి చెందిన సామ సతీష్‌రెడ్డి(28) బైక్‌పై గ్రామ శివారులోని పెట్రోల్ బంక్‌కు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా రోడ్డుపై నిలిపి ఉన్న బొలేరో వాహనాన్ని గమనించకుండా ఢీకొట్టాడు. దీంతో సతీష్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తల్లి రెండేళ్ల క్రితం మృతిచెందింది. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో మృతుడి తండ్రి వెంకటరెడ్డి రోదనలు మిన్నంటాయి. గ్రామ సర్పంచ్ సానబోయిన రజిత సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

అయిటిపాముల గ్రామ శివారులో..




లింగయ్య (ఫైల్)

కట్టంగూర్: మండల పరిధిలోని అయిటిపాముల గ్రామ శివారులో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన నిమ్మనగోటి లింగయ్య(34) నకిరేకల్‌లో బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి నకిరేకల్ నుంచి చిట్యాలలో ఉన్న తన అన్న ఇంటికి బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యలో అయిటిపాముల గ్రామ శివారులోని పత్తి కంపెనీ సమీపంలో కల్వర్టు వద్దకు రాగానే విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్ బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లింగయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

పారిశ్రామికవేత్తలు జ్ఞానదాతలు కావాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్



'మరుపురాని మాస్టర్.. మా సారు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్

కోదాడ: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని సిమెంట్ పరిశ్రమల యజమానులు విద్యారంగ అభివృద్ధికి ముందుకొచ్చి జ్ఞాన తెలంగాణ సాధనలో భాగస్వాములు కావాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం పెద్దఎత్తున గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశారని, కానీ వాటిలో చాలా వాటికి సొంత భవనాలు లేవని అన్నారు. ప్రభుత్వ స్థలాలు పెద్దఎత్తున ఉన్నందున పరిశ్రమల యజమానులు భవన నిర్మాణాలు చేయాలని కోరారు.

విద్యారంగంలో అస్తమించని సూర్యుడు..

కోదాడఅర్బన్: విద్యారంగంలో అస్తమించని సూర్యుడు స్వర్గీయ కొండపల్లి రామానుజరావు అని జూలూరు గౌరీశంకర్ అన్నారు. కోదాడ పట్టణంలోని మేళ్లచెర్వు కాశీనాథం, వెంకటరత్నం ఫంక్షన్ హాల్‌లో కొండపల్లి రామానుజరావు సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు రామానుజరావు జ్ఞాపకార్థం తీసుకొచ్చిన 'మరపురాని మాస్టర్.. మా సారు' పుస్తకాన్ని విద్యావేత్తలు భరతరావు, శ్రీరామకవచం, డాక్టర్ జాస్తి సుబ్బారావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, డాక్టర్ రాఘవరావు, సుగుణ, వెంకటేశ్వరరావు, వెంకట శేష ప్రసాద్, డాక్టర్ అండె సత్యం, రామానుజరావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.